## క్లుప్తంగా

### బీజేపీ అధ్యక్షుడికి సన్మానం



శాలువా కప్పి సత్కరిస్తున్న నాయకులు

**టేకులపల్లి:** బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గిరిజన ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.హాతీరాం నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ధరావత్ బాలాజీ నాయక్, జరుపుల రామచంద్రనాయక్, బాదావత్ సురేష్ నాయక్, శంభు, నవీన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగానికి అన్యాయం

**టేకులపల్లి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు విమర్శించారు. ఈ మేరకు శనివారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం కేటాయించడం దారుణమన్నారు. ప్రజా ప్రభుత్వం అంటున్న కాంగ్రెస్ ఈ నిధులతో ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో చెప్పాలన్నారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గానికో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీపై చర్చ కూడా లేదన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి నిధులు పెంచి ప్రభుత్వ విద్యారంగాన్నా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పరిశోధనలపై అవగాహన కల్పించండి..

**కొత్తగూడెంఅర్బన్:** విద్యార్థులకు పరిశోధనలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం, పాఠశాల విద్య న్యూఢిల్లీ, ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారి సంయుక్త ఆదేశాల మేరకు ప్రతీ పాఠశాలలో తప్పనిసరిగా ఒకరోజు శాస్త్రవేత్తలను గుర్తు చేసుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమీపంలో ఉన్న సాంకేతిక పరిశోధన కేంద్రాలు కానీ, ఇతర పరిశోధన కేంద్రాలు, ప్రయోగశాలల వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి పరిశోధన గురించి తెలియజేయాలని కోరారు. ఏప్రిల్ మూడో తేదీ లోగా పాఠశాల నివేదిక, ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసును సంప్రదించాలని తెలిపారు.

### కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

**కొత్తగూడెంఅర్బన్:** జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్షలు శనివారం మూడోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా జర్నలిస్టులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. దీక్ష శిబిరాన్ని న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.సంజీవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రణయ్‌కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు.

### అదనపు బోగీలకు వినతి

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెం – బల్హార్షా మార్గంలో నడుస్తున్న సింగరేణి రైలులో వృద్ధులు, వయస్సు పైబడిన వారి కోసం చైర్ కార్ బోగీ, అదనంగా నాలుగు బోగీలు సమకూర్చాలని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ వై.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఏరియా ఆఫీసర్ మీనాకు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం – డోర్నకల్ ప్యాసింజర్ రైలును తిరిగి ప్రారంభించాలని, జర్నలిస్టులు, సీనియర్ సిటిజన్లకు రాయితీ అమలు చేయాలని కోరారు.

### రైతు సంక్షేమానికి కృషి

**పాల్వంచరూరల్:** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో రైతులు, నాయకులతో కలిసి కొత్వాల... సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మాట్లాడుతూ... ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.24,439 కోట్లు, నీటిపారుదలశాఖకు రూ.23,373 కోట్లు, రైతు భరోసాకు రూ.18000 నిధులు కేటాయించడం హర్షణీయం అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యర్రంశెట్టి ముత్తయ్య, మాలోతు నందనాయక్, బాదర్ల జోషికుమార్, పైడిపల్లి మహేష్, కొండం పుల్లయ్య, బండ్లపల్లి వెంకటనారాయణ, బానోతు బాలాజీ, కాపర్తి వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

# దండుకుంటున్న దళారులు

- సగానికి పైగా విస్తీర్ణంలో చేతికందిన మక్కలు
- విక్రయానికి సిద్ధంగా రైతులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక మధ్యవర్తులకు విక్రయం
- మద్దతు ధర దక్కక నష్టపోతున్న రైతులు



తేమ తగ్గేందుకు ఆరబెట్టిన మొక్కజొన్నలు

**ఇల్లెందురూరల్:** ఇల్లెందు ఏజెన్సీలో సాగునీటి వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఎక్కువ మక్కువ చూపుతారు. ఈ కారణంగా జిల్లాలోనే అత్యధిక సాగు విస్తీర్ణం ఇక్కడే నమోదవుతోంది. రైతులకు మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వం సాధారణంగా పంట చేతికందే దశలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. కానీ దిగుబడి సగానికి పైగా విక్రయాలు పూర్తయ్యాక.. నింపాదిగా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ప్రతీఏటా చూస్తున్నాం. ఈసారి కూడా అదే పునరావృతం అవుతున్నట్లుంది. ఇదే అదునుగా గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు.

**12వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు...**
మండలంలో వానాకాలంలో వర్షాధారంగా అత్యధిక విస్తీర్ణంలో మొక్కజొన్నను సాగుచేస్తుంటారు. యాసంగిలో మాత్రం బోర్లు, బావులు అందుబాటులో ఉన్న చోటే సాగు చేయడం ఏటా చూస్తున్నాం. నీటి యాజమాన్యం తక్కువగా ఉండే మొక్కజొన్న సాగుపైనే రైతులు యాసంగిలోనూ మక్కువ చూపారు. ఫలితంగా సుమారుగా 12వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇక పోడు భూములలో మరో పదివేల ఎకరాల్లో సాగైనట్లు సమాచారం. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటడంతో చివరి తడికి మినహా ఈ సీజన్ రైతులు పెద్దగా ఇబ్బంది పడిన ఘటనలు లేవు. ఈ కారణంగా దిగుబడిపై కొంత ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా యాసంగిలో ఎకరానికి 35క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం 30 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు.

**వర్ష సూచనతో కలవరం...**
వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడం అందుకు అనుగుణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది.

ప్రస్తుతం కంకులను మర పట్టించి గింజలను కల్లాల్లో ఆరబెట్టిన రైతులు తేమశాతం రావడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడానికి తోడు వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గత్యంతరం లేక కమీషన్‌దారులు అడిగిన ధరకు విక్రయిస్తూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ప్రభుత్వ తాత్సారంతో తగ్గుతున్న ధర...**
ప్రతీఏటా మొక్కజొన్న పంట చేతికందే సమయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ విషయంలో ఏ మాత్రం జాప్యం చోటుచేసుకున్నా దళారులు తమ మాయాజాలం ప్రదర్శించి మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఇదే తరహాలో ఈసారి కూడా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మార్క్‌ఫెడ్ నుంచి స్పష్టత లేకపోవడంతో పదిరోజుల నుంచి మొక్కజొన్న ధర తగ్గుతూ వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధర రూ.2,225 ఉండగా పదిరోజుల క్రితం వరకు రూ.2,100కు కొనుగోలు చేసిన దళారులు క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం రూ.2వేలుగా నిర్ణయించారు.



విక్రయానికి సిద్ధం చేసిన మక్కలు

ఇది కూడా మరింత తగ్గే పరిస్థితి ఉందని ప్రచారం చేస్తున్నారు. అదే జరిగితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50శాతం పంట చేతికందగా మిగతాది కంకులు విరవడం, ఆరబెట్టడం వంటి పనులు చేస్తున్నారు.

**కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి**



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ చివరి తడికి నీరందక ఎకరానికి 25 క్వింటాళ్లే వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో స్థానిక వ్యాపారులు రూ.1,900లకే అడుగుతున్నారు. ఆలస్యం చేస్తే ధర మరింత తగ్గుతుందని భయపెడుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

– దేవయ్య, రైతు, కొమరారం

**త్వరలో నిర్ణయం తీసుకుంటాం..**



ప్రస్తుతం ఖమ్మం జిల్లాకు సంబంధించి కొనుగోళ్ల ప్రక్రియపై దృష్టి పెట్టాం. మూడు రోజుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనుగోళ్లపై అక్కడి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. భద్రాద్రి జిల్లాలోనూ త్వరితగతిన పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. మద్దతు ధర అందించేందుకు కృషి చేస్తాం.

– సునిత, డీఎం, మార్క్‌ఫెడ్ మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి..



నినాదాలు చేస్తున్న కార్మికులు

**ఇల్లెందురూరల్:** హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. కొమరారం గ్రామంలో శనివారం హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం బరువులు ఎత్తుతూ చాలీచాలని వేతనాలతో హమాలీ కార్మికులు దుర్భర జీవనం గడుపుతున్నారని వాపోయారు. కార్మికుల దుస్థితిని గమనించి సంక్షేమ పథకాల కేటాయింపులో హమాలీలకు ప్రాధాన్యమివ్వాలని, పని ప్రదేశంలో భద్రత కల్పించడంతోపాటు 50 సంవత్సరాలు పైబడిన హమాలీలకు నెలకు రూ.6వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే ఇఫ్టూ అనుబంధ విలీన మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో హచ్చ, నరేష్, జీవన్, సాంబ, చంద్రం, వసంత్, గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.

# బార్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

**ఇల్లెందు:** ఇల్లెందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశానుసారం ఇల్లెందు బార్ కౌన్సిల్‌కు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. బార్ అధ్యక్ష ఎన్నికలకు న్యాయవాదులు రవికుమార్, కె.ఉమామహేశ్వరరావు, కలవల సుధాకర్ పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి కీర్తి కార్తీక్, సువర్ణపాక సత్యనారాయణ తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక కోశాధికారి పోస్టుకు కూడా రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వినోద్, బన్సీలాల్ దాఖలు చేశారు. ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఉపాధ్యక్షుడిగా ఖాసీం, సంయుక్త కార్యదర్శిగా నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో 50 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల అధికారిగా మల్లికార్జున్‌రావు, ఆనంద్ వ్యవహరిస్తున్నారు.

# నీటి వనరులను సంరక్షించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పాల్వంచరూరల్:** వరల్డ్ వాటర్ డే సందర్భంగా మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం జల సంరక్షణ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ.. ప్రతీఒక్కరికి జల వనరులు, తాగునీటిపై అవగాహన ఉండాలని, నీటిని వృథా చేయకుండా రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉష, వైస్ ప్రిన్సిపాల్ జె.మాధవి, డాక్టర్ కామేశ్వరరావు, శ్రీదేవి, టి.అరుణకుమారి, డి.రమేష్, స్వరూపరాణి, శ్రీనివాస్, రాంబాబు, విమల, దీపిక, హారిక, కావ్య, రమేష్, ధర్మారపు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న రమాదేవి

**టేకులపల్లి:** ప్రెగళ్లపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యదర్శి సతీష్, మాజీ సర్పంచ్ రమాదేవి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్ అంతోటి లీలాబాయి, స్థానికులు శ్రీనివాస్‌చారి, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు నిబంధన తొలగించండి..



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**కొత్తగూడెంఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం లబ్ధిదారులకు ష్యూరిటీ లేకుండా రుణం మంజూరు చేసి, నిరుద్యోగులకు, నిరుపేదలకు చేయూతనివ్వాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళారుల వల్ల లబ్ధిదారులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**జూలూరుపాడు:** రాజీవ్ యువ వికాసం పథకానికి రేషన్ కార్డుతో సంబంధం లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ రేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మార్చి 8న రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పి రెండు వారాలు అవుతున్నా ఇవ్వలేదన్నారు. యువతకు రాజీవ్ యువ వికాసం పథకం వరం లాంటిదని, రేషన్ కార్డు లేకపోవడంతో శాపంలా మారిందని వాపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ కార్డు లేకుండా దరఖాస్తు తీసుకునేలా చూడాలన్నారు.

### నేడు సింగరేణిలో రాత పరీక్ష

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులకు సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. చార్జ్‌హ్యాండ్ (మెకానికల్) 20 పోస్టులకు 56 మంది, వెల్డర్ ట్రైనీ క్యాటగిరి–14 పోస్టులకు గాను 33 మంది దరఖాస్తు చేసుకోగా హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

### సికిల్‌సెల్‌పై అవగాహన ఉండాలి



శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు

**కొత్తగూడెంఅర్బన్:** జాతీయ సికిల్ సెల్ ఎనీమియా ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్ హాజరై ఎన్సీడీ ప్రోగ్రాం అధికారులకు శిక్షణ ఇచ్చారు. సికిల్‌సెల్ ఎనీమియా వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి..



పాల్వంచ: మాట్లాడుతున్న రమేష్

**పాల్వంచ:** కార్మికుల కనీస వేతనాల జీఓను విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద కార్మిక సంఘాల జేఏసీ ధర్నాకు పోలీసులు అనుమతి ఇచ్చి నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ అన్నారు. శనివారం స్థానిక టీయూసీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్ యాకూబ్ షావలీ, ఉపాధ్యక్షుడు గోనెల రమేష్, వై.గోపాలరావు, సహాయ కార్యదర్శి పెద్దబోయిన సతీష్, బోళ్ల సీతారాములు, రాయల సిద్ధు, బొల్లి రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డి పాలన కేసీఆర్ పాలనను తలపిస్తోందన్నారు. కార్మిక సమస్యలపై ప్రశ్నించడం నేరమా అని ప్రశ్నించారు. అరెస్టులు, బెదిరింపులతో ప్రజాపాలనను ఎంతోకాలం నడపలేరన్నారు. కార్యక్రమంలో కె.భాస్కర్, జి.వెంకటేశ్వర్లు, శ్రీహరి, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందు:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ధర్నాకు వెళ్లనున్న కార్మిక నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని టీయూసీఐ జిల్లా నాయకుడు యాకుబ్‌షావలీ అన్నారు. శనివారం ఇల్లెందులోని టీయూసీఐ కార్యాలయంలో మాట్లాడుతూ... ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా అరెస్టు చేసిన నాయకులను వెంటనే వదిలిపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, వీరన్న, సీతారాములు, రవి పాల్గొన్నారు.

# ట్రాన్స్‌పోర్టు కార్మికుల ‘చలో ఢిల్లీ’



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఇల్లెందు:** దేశంలో ఆర్టీసీలను రక్షించుకోవటం, రవాణా రంగాలను కాపాడుకునేందుకు జరగనున్న ఆందోళనను విజయవంతం చేయాలని సీఐటీయూ కార్మికవర్గాన్ని కోరింది. శనివారం ఇల్లెందులో యూనియన్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ మాట్లాడుతూ... రవాణా రంగంలో కార్మికవర్గం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మికవర్గ విధానాలు, 2019లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం కారణం అన్నారు. అంతకు ముందు ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు, కృష్ణ, అంజయ్య, బీకే రావు, పీఎల్ రావు, నజీర్, బీఆర్ బాబు, సీతారాములు, నాగలక్ష్మి, చైతన్య పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

**జూలూరుపాడు:** మండల కేంద్రం జూలూరుపాడులోని రెండు పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.వెంకటేశ్వరాచారి, ఏసీజీఈఎస్ మాధవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఆరా తీశారు. సీఎస్ లక్ష్మీనర్సయ్య, డీఓ డి.నరసింహారావు, సిట్టింగ్ స్క్వాడ్ బి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**ఇల్లెందురూరల్:** దేశం కోసం తన ప్రాణాలను త్యజించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ భవిష్యత్ కోసం యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. మండలంలోని సుందరయ్యనగర్‌లో శనివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి వనరులు మెరుగుపర్చి వారి భావిజీవితం ఉన్నతంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి కిరణ్, తాళ్ళూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, కొడెం బోస్, అబ్బాస్, కృష్ణ, విజయ్, మోహన్‌సింగ్, సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ‘సింగరేణి’ అవకాశాన్ని అందిపుచ్చుకోండి..



నియామకపత్రం అందజేస్తున్న జీఎం శాలేంరాజు

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి అందించిన అవకాశాన్ని అందిపుచ్చుకొని విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు పేర్కొన్నారు. శనివారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు 17 మందిని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్‌రావు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, శివకేశవరావు, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాల ఏర్పాటు ఎప్పుడో..?

- అధిక ఉష్ణోగ్రతలతో అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

**కొత్తగూడెంఅర్బన్:** వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడం వలన ప్రజలు ఎక్కువగా ఆహారం కంటే కూడా మంచినీళ్లు తాగడానికే ఇష్టపడుతున్నారు. వేడి, ఉక్కపోత కారణంగా చెమట ఎక్కువగా బయటకు రావడంతో మంచినీటిని ఎక్కువగా తాగాల్సి వస్తుంది. ఈ క్రమంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు మార్చి మొదటి వారంలోనే పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తే అన్నివర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇంత వరకు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రజలు, మున్సిపల్ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా మున్సిపల్ అధికారులు చలివేంద్రాల ఏర్పాటు నిర్లక్ష్యం వహించి పట్టణంలో ఆలస్యంగా నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. కానీ కొద్ది రోజులకే నిర్వహణ లేక మూతపడ్డాయి. ఈ ఏడాదైనా ఇలా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. బొగ్గు గనుల ప్రాంతం కావడం వలన ఇతర ప్రాంతాల కంటే కొత్తగూడెం మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. ఈ మేరకు పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

**స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి..**
కొత్తగూడెంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలివేంద్రాల ఏర్పాటులో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. మున్సిపాలిటీ వారు కానీ, స్వచ్ఛంద సంస్థల వారు కానీ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే కొద్ది రోజులకే మూసి వేయకుండా నిర్వహణ బాధ్యతలు ఎవరికైనా అప్పగించాలని కోరుతున్నారు.

**కార్యాలయాల్లో కూడా కానరాని తాగునీరు...**
కొత్తగూడెం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తాగునీటి సదుపాయం లేకపోవడం వలన అక్కడికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయం, పోలీసు స్టేషన్లు, బస్టాండ్‌లలో తాగునీటి సదుపాయం లేదు. వాటర్ కూలర్ ఉంటుంది కానీ, అందులో నీరు పోసేవారు ఉండరు.. కూలింగ్ మిషన్ పని చేయదు. మరికొన్ని చోట్ల వాటర్ కూలర్ ఉంటుంది కానీ, తాగేందుకు గ్లాసు ఉండదు. చలివేంద్రాలను పట్టణంలో ఏర్పాటు చేయకపోవడం వలన ప్రజలు కొనుక్కుని నీళ్ల తాగాల్సిన పరిస్థితి ఉంది.

**చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు..**



వేసవికాలం నేపథ్యంలో పట్టణంలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో కూడళ్లలో తాగునీరు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం. మున్సిపల్ సిబ్బందితో చర్చించి పట్టణంలో రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– సుజాత, ఇన్‌చార్జ్ కమిషనర్, కొత్తగూడెం